సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ


శనివారం | 27 | ఏప్రిల్ | 2024



'సెల్'వుల్లో ఆటలేనా..!

వేసవి సెలవుల్లో పిల్లలు మొబైల్ ఫోన్ అతిగా వాడడం, అల్లరి చేష్టలతో ఎక్కడ ప్రాణాల మీదకు తెచ్చుకుంటారోనని తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది..

8లో



5,950 క్యూసెక్కుల నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 1,500, మధ్య డెల్టాకు 1,100, పశ్చిమ డెల్టాకు 3,350 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 7.45 అడుగులు ఉంది.

గరిష్టం/కనిష్టం 42.5° / 26.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	42.5	26.0
కాకినాడ	39.7	27.6
అమలాపురం	40.0	26.0

న్యూస్‌రీల్

అన్నదాన భవనానికి రూ.లక్ష విరాళం



దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఈఓ కిశోర్‌కుమార్

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి ఉండి మండలం మహదేవపట్నానికి చెందిన పొట్టూమ సీతారాముడు, జ్యోతి దంపతులు రూ.1,00,001 విరాళంగా అందించారు. ఈ విషయాన్ని ఆలయ ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు. దాతకు ఆయన చేతుల మీదుగా స్వామివారి చిత్రపటం అందజేశారు.

వేంకటేశ్వరునికి విశేషాభిషేకాలు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో సప్తమ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వేదపండితులు స్వామికి విశేషాభిషేకాలు జరిపారు. పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. విశేష పూజలు చేశారు. అనంతరం చక్రస్నానం నిర్వహించారు. అనంతం అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపకుడు గణేశుల వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

జిల్లాలో నేడు 14 కేంద్రాల్లో నిర్వహణ

రాయవరం: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి పాలిసెట్–2024 శనివారం జరగనుంది. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్ష సమయానికి గంట ముందుగానే పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులను అనుమతిస్తారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 14 కేంద్రాల్లో 4,830 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పరీక్ష ఉంటుంది. పరీక్ష కేంద్రంలోకి ఉదయం 10 గంటల నుంచి అనుమతిస్తారు. పరీక్ష ప్రారంభమైన ఉదయం 11 గంటల తర్వాత ఒక నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతించరు. విద్యార్థులు హాల్ టిక్కెట్, బాల్ పాయింట్ పెన్ను, హెచ్‌బీ పెన్సిల్, ఎరాజర్, షార్ప్‌నర్ వెంట తీసుకువెళ్లాలి. సెల్‌ఫోన్, కాలిక్యులేటర్ తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రంలోకి అనుమతించరు.

హాల్ టిక్కెట్ రాకుంటే..

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పాలిసెట్ ప్రవేశ పరీక్ష–2024 జిల్లా కోఆర్డినేటర్ సముద్రాల రామారావు శుక్రవారం తెలిపారు. విద్యార్థులు గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాల న్నారు. ఆయా కేంద్రాల ఆవరణలో తాగునీరు, విద్యుత్తు, వైద్య సేవలు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. కేంద్రానికి విద్యార్థులు చేరుకోవడానికి అవసరమైన బస్సులు ఏర్పాటు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ద్వారా ఏపీఎస్ ఆర్టీసీ అమలాపురం, రామచంద్రపురం డిపోలకు తెలియజేశామన్నారు. విద్యార్థులు ఎవరికైనా హాల్ టిక్కెట్లు రాకుంటే జిల్లా కో ఆర్డినేటర్ ఎస్.రామారావు (94401 24846) నంబరులో సంప్రదించవచ్చన్నారు. ఒకవేళ సాంకేతిక కారణాలతో హాల్ టిక్కెట్ రాకపోతే, అటువంటి అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి వెళితే తాత్కాలికంగా ఫీజు కట్టించుకుని, పరీక్షకు అనుమతిస్తారన్నారు.

పట్టుపట్టి.. పంట గట్టెక్కించి..



లొల్ల లాకుల వద్ద గలగల పారుతున్న గోదావరి



డెల్టాలో చేతికందివచ్చిన రబీ వరి చేను

- రబీకి సాగునీటి సరఫరా పూర్తి
- అంచనాలకు మించి జలాల విడుదల
- ప్రభుత్వం చొరవతో గట్టెక్కిన పంట
- 30 నుంచి డెల్టా కాలువల మూసివేత

సాక్షి, అమలాపురం: ప్రణాళికగా సాగితే.. దానికి ప్రభుత్వం చొరవ తోడైతే.. సిరుల పంటే. ప్రభుత్వ సహకారం, ప్రజాప్రతినిధుల తోడ్పాటుతో రైతులు రబీని సమర్థంగా పూర్తి చేశారు. గోదావరిలో గత ఏడాది నీటి లభ్యత తక్కువగా ఉందని, డెల్టాలో రబీ సాగుకు నీటి ఎద్దడి తప్పదని.. ఆయకట్టు కొంత వరకూ కోత పెట్టాల్సిందేనని ఇరిగేషన్ అధికారులు ముందే అంచనా వేశారు. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రం రైతుల సంక్షేమం దృష్ట్యా మొత్తం ఆయకట్టుకు సాగునీరు అందించాలని తేల్చిచెప్పింది. ఇందుకు అనుగుణంగా జిల్లాలోని వైఎస్సార్ సీపీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు పట్టుబట్టి మరీ మొత్తం ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలని తీర్మానించారు. అందుకు తగినట్టుగా సాగునీటి పారుదల శాఖ అధికారులు నీటి యాజమాన్య పద్ధతులు పాటించి రబీకి పూర్తి స్థాయిలో సాగు నీరందించి రైతులతో శెభాష్ అనిపించుకున్నారు. పంట కాలం సాఫీగా సాగడంతో పాటు మంచి దిగుబడులు రావడంతో పుడమి పుత్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గోదావరి డెల్టాలో రబీకి సాగునీరు సరఫరా పూర్తయ్యింది. ప్రస్తుతం తాగునీటి అవసరాల కోసం పంట కాలువలకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం మూడు పంట కాలువలకు సంబంధించి తూర్పు డెల్టాకు 1,500, మధ్య డెల్టాకు 1,200, పశ్చిమ డెల్టాకు 3,350 క్యూసెక్కుల చొప్పున మొత్తం 6,050 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీకి రోజుకు 5,602 క్యూసెక్కుల నీరు వస్తుండగా, ఇందులో సీలేరు నుంచి 3,461 క్యూసెక్కులు వస్తోంది. ఈ నెలాఖరు 30వ తేదీ నాటికి డెల్టా కాలువలకు నీటి విడుదలను నిలిపివేయనున్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్ణయించినట్టుగా ముందస్తు ఖరీఫ్ ప్రోత్సాహంలో భాగంగా మళ్లీ జూన్ 1వ తేదీ నుంచి పంట కాలువలు తెరవనున్నారు. అయితే రబీలో కనీసం 90 టీఎంసీల నీరు అవసరమని, ఆ స్థాయిలో గోదావరిలో నీటి లభ్యత లేకపోవచ్చని అధికారులు అంచనా వేశారు. అయితే పోలవరం ప్రాజెక్టు వద్ద నీటి నిల్వకు అవకాశం ఉండడంతో పాటు సీలేరు నుంచి వచ్చిన నీటితో డెల్టాలోని చేలకు నీటి సరఫరా చేశారు. రబీ సీజన్‌లో అంచనాలకు మించి ఏకంగా 103.895 టీఎంసీల నీరు వినియోగించడం విశేషం.

ఎద్దడి వస్తే తక్షణ చర్యలు

సాగునీటి యాజమాన్య చర్యల్లో భాగంగా జనవరి నెల నుంచి లాకుల వారీగా వంతుల వారీ విధానాన్ని అమలు చేశారు. ఇది చాలా వరకూ సత్ఫలితాలను ఇచ్చింది. మధ్య డెల్టాలోని శివారు మెరక ప్రాంతాల్లో అప్పుడప్పుడు రైతులు నీరందక ఇబ్బంది పడిన సందర్భాల్లో అధికారులు తక్షణం స్పందించి సాగునీటి సరఫరాను మెరుగుపరిచారు. దీంతో నీటి ఇబ్బందులు రాకుండా డెల్టాలో రబీలో వరి సాగు గట్టెక్కింది.

రబీ షెడ్యూల్ మొదలైన డిసెంబర్ 7వ తేదీ నుంచి ఏప్రిల్ 26వ తేదీ వరకూ డెల్టా కాలువలకు నీటి వినియోగం (టీఎంసీలలో)

డెల్టా కాలువ	నీటి వినియోగం
తూర్పు డెల్టా	30.83
మధ్య డెల్టా	20.042
పశ్చిమ డెల్టా	53.023
మూడు డెల్టాలకు	103.895
మిగులు జలాలు	11.512
మొత్తం వినియోగం	115.407

ఆశాజనకంగా దిగుబడులు

గోదావరి డెల్టాలో రబీ సాగులో దిగుబడులు అధికంగా వస్తాయి. ఈసారి కూడా మంచి దిగుబడులు వచ్చాయని అధికారులు చెబుతున్నారు. తూర్పు డెల్టా పరిధిలోని అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోకి వచ్చే రామచంద్రపురం, ఆలమూరు వ్యవసాయ సబ్ డివిజన్లలో ప్రాంతాన్ని బట్టి ఎకరాకు 48 బస్తాల (బస్తా 75 కిలోలు) నుంచి 55 బస్తాల వరకూ దిగుబడి వస్తోంది. కాకినాడ జిల్లా పరిధి కరప, సామర్లకోట, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని అనపర్తి, రాజమహేంద్రవరం వ్యవసాయ సబ్ డివిజన్లలో సైతం ఇదే దిగుబడి వస్తోందని అంచనా వేస్తున్నారు. మధ్య డెల్టా పరిధిలోని అమలాపురం, పి.గన్నవరం, రాజోలు, ముమ్మిడివరం వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో 35 బస్తాల నుంచి 45 బస్తాల వరకూ దిగుబడి వస్తోంది. తూర్పు డెల్టాలో ఇప్పటికే 60 శాతానికి పైగా వరి కోతలు పూర్తయ్యాయి. మధ్య డెల్టాలో మాత్రం 25 శాతం వరి కోతలు జరిగాయని అంచనా. కోనసీమ జిల్లాలో 1.69 లక్షల ఎకరాల్లో వరి సాగు జరగ్గా 43 వేల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బోసు బాబు 'సాక్షి'కి తెలిపారు.

సకాలంలో సాగునీరు



సకాలంలో సాగునీరు అందడంతో ఆశాజనకంగా దిగుబడి వచ్చింది. ప్రస్తుతం మూడెకరాల వరి సాగు చేస్తున్నాను. గతంలో సాగునీటి ఎద్దడి రావడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నాను. ఈ రబీ పంటకు సకాలంలో నీరు అందడం వల్ల ఖర్చులు తగ్గాయి. పంట దిగుబడి పెరిగింది. గతంలోలా ఇంజిన్ల ద్వారా నీరు తోడే పరిస్థితి లేదు. త్వరలో వరి పంటను కోసేందుకు సిద్ధంగా ఉన్నాను.

–పెనుమాల వెంకటరమణ, రైతు, నేదునూరు

అన్ని దశల్లోనూ అండగా..



రబీ పంట సాగుకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలిచింది. నారుమడులు వేసిన నాటి నుంచి పంట కోసే వరకూ ఏ దశలోనూ నీటి ఇబ్బంది రాకుండా సహకారం అందించింది. దీంతో సాగు ప్రణాళికాబద్ధంగా సాగింది. దిగుబడి ఆశాజనకంగా ఉంది.

–తిరునాతి చిన్నబ్బు, రైతు, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం మండలం

నామినేషన్ల పరిశీలన... తిరస్కరణ



వచ్చిన నామినేషన్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

అమలాపురం రూరల్: అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గానికి జరుగుతున్న ఎన్నికలకు సంబంధించి 21 మంది నామినేషన్లు వేయగా, ఐదింటిని తిరస్కరించినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా శుక్రవారం వెల్లడించారు. నామినేషన్లు అంగీకరించిన వారిలో రాపాక వరప్రసాదరావు (వైఎస్సార్ సీపీ), జంగా గౌతమ్ (కాంగ్రెస్), యాళ్ల దొరబాబు (బహుజన సమాజ్ పార్టీ), గంటి హరీష్ మాధుర్ (టీడీపీ), కాత్రు నాగబాబు (తెలుగు నవగర్జన), కాప కళ్యాణ్ (ఆర్‌పీఐ), కృష్ణమాత (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), గిడ్డి జ్ఞాన ప్రకాశరావు (ఆర్‌పీఐ), పాతూరు రమేష్ (పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా డెమోక్రటిక్), భూసిమ్ రమణమ్మ (రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ సెక్యులర్), జిల్లెల్ల రమేష్ (జాతీయ జనసేన), ఎడ్ల రాజేష్ (లిబరేషన్ కాంగ్రెస్), యాలంగి రమేష్ (జై భీమ్ రావు భారత్), స్వతంత్ర అభ్యర్థులు గుడే వెంకటేశ్వర్లు, మాకే డెవి ప్రసాద్, వడ్డి లలిత్‌కుమార్ ఉన్నారు. వైఎస్సార్ సీపీ తరఫున నామినేషన్ వేసిన రాపాక వెంకట్రామ్, టీడీపీ తరఫున నామినేషన్ వేసిన సునీల్‌రాజ్ నక్కా, స్వతంత్ర అభ్యర్థులు ఇసుకపట్ల ఇమ్మానియేల్ కుమార్, కావూరి మధుసూదన్‌రావు, ప్రభాకర్‌రెడ్డి కొండేటి నామినేషన్లు తిరస్కరించారు.

అసెంబ్లీ స్థానాల్లో 26 తిరస్కరణ

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి నామినేషన్ల పరిశీలన అనంతరం 26 నామినేషన్లు తిరస్కరించారు. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 21 అభ్యర్థులు నామినేషన్లు వేయగా మూడింటిని తిరస్కరించారు. ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గానికి మొత్తం 22 నామినేషన్లు రాగా ఐదు తిరస్కరించబడ్డాయి. కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గానికి 18 మంది నామినేషన్లు రాగా నలుగింటిని తిరస్కరించారు. మండపేటకు సంబంధించి 16 నామినేషన్లలో మూడు, రామచంద్రపురానికి 21 నామినేషన్లలో ఐదు, రాజోలుకు 15 నామినేషన్లలో నాలుగు, పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గంలో 17 నామినేషన్లకు పరిశీలన రెండింటిని తిరస్కరించారు.

సమ సమాజానికి ఓటే వజ్రాయుధం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: సమ సమాజ నిర్మాణానికి ఓటు వజ్రాయుధం లాందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా అన్నారు. ఓటు గొప్పతనంపై శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం చాలా మంది ఓటును కేవలం ఎన్నికల ప్రక్రియగా, రాజకీయ తంతుగా భావిస్తున్నారని ఆయన అన్నారు. అది సరికాదని, సమాజం పురోగతి సాధించాలనే భావనతో ప్రతి పౌరుడూ ఓటు వేయాలన్నారు. కుల, మత, ప్రాంత, లింగ, జాతి, భాష అనే భేదం లేకుండా దేశంలో నివసించే 18 ఏళ్లు నిండిన పౌరులందరికీ భారత రాజ్యాంగం ఆర్టికల్ 326 కింద ఓటు హక్కు కల్పించిందన్నారు. ఈ హక్కును వినియోగించుకుని నిస్వార్థంగా, సమాజానికి సేవలు అందించే పరిపాలనాధక్షులను ఎన్నుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా, స్వేచ్ఛగా ఈ హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల్లో నిలబడిన అభ్యర్థులు నచ్చకపోతే తిరస్కరణ ఓటు వేసే అవకాశాన్ని కేంద్ర ఎన్నికల కమిషన్ ఓటర్లకు నోటా ద్వారా కల్పించిందన్నారు.

పోలింగ్, కౌంటింగ్ రోజుల్లో సెలవులు ఇవ్వాలి

పార్లమెంట్, శాసనసభ సాధారణ ఎన్నికలు, పోలింగ్ రోజున పోలింగ్ స్టేషన్లు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన సంస్థలకు ఆ రోజుల్లో స్థానిక సెలవులు ప్రకటించాలని జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా తెలిపారు. అమలాపురం కలెక్టరేట్‌లో ఎన్నికల నిర్వహణపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత ఎన్నికల సంఘం సూచనల మేరకు కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులకు అసెంబ్లీ నియోజకవర్గంలో పోలింగ్ రోజున స్థానిక సెలవు ప్రకటించేందుకు అధికారం ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. మే 13న సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ స్టేషన్లు, పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేసిన సంస్థలకు సెలవును, జూన్ 4వ తేదీ కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటైన సంస్థలకు సెలవు దినంగా ప్రకటించిందన్నారు. ఎన్నికల సంఘం సూచనలను జిల్లా అధికారులు, రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు విధిగా పాటించాలని ఆదేశించారు.

డీజిల్ ట్యాంకర్ సీజ్

ముమ్మిడివరం: యానాం నుంచి అక్రమంగా డీజిల్‌ను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు సీజ్ చేసి, రెండు వేల లీటర్ల డీజిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. 216 జాతీయ రహదారిపై ఎన్నికల స్క్వాడ్ అధికారులు శుక్రవారం తనిఖీ చేస్తుండగా, ట్యాంకర్ ద్వారా యానాం నుంచి అక్రమంగా డీజిల్ తరలిస్తుండగా, పట్టుకుని ముమ్మిడివరం పోలీసులకు అప్పగించారు. సంగీతం వెంకటరాజు యానాం నుంచి డీజిల్ తరలిస్తున్నట్టు గుర్తించారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై డి.సురేష్‌బాబు తెలిపారు.

పేలవంగా పవన్ కల్యాణ్ సభ

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ బహిరంగ సభ శుక్రవారం రాత్రి 7 గంటలకు జరగాల్సి ఉంది. అయితే ఆయన ద్రాక్షారామ చేరుకునే సరికి చాలా ఆలస్యమైంది. ఎన్నికల కోడ్ ప్రకారం 10 గంటలకు ప్రసంగం ముగించాల్సి ఉండటంతో కేవలం 9 నిమిషాలు మాత్రమే పొడిపొడిగా మాట్లాడి పవన్ తన ప్రసంగం ముగించారు. మీతో గంటన్నర పైగా మాట్లాడాల్సింది ఉందని, అందుకే వీలు కుదిరితే మళ్లీ వస్తానని చెప్పారు. రామచంద్రపురం నియోజకవర్గంలో జనసేన పోటీ చేయాల్సి ఉందని, అయితే పొత్తులో భాగంగా టీడీపీకి ఇచ్చామన్నారు. 175 నియోజకవర్గాల్లోనూ జనసేన, టీడీపీ, బీజేపీ పోటీ చేస్తున్నట్లే భావించాలని కోరారు.

అన్నదమ్ముల సవాల్

- ఎన్నికల వేళ టీడీపీకి బిగ్ షాక్
- తునిలో నిట్టనిలువునా పార్టీలో చీలిక
- రామకృష్ణుడుకు కోలుకోలేని ఎదురుదెబ్బ
- ఆది నుంచి విభజించి పాలించిన యనమల
- నమ్ముకున్నందుకు నట్టేట ముంచేశాడు
- 40 ఏళ్ల సేవలకు అవమానాలా?
- అన్నపై తమ్ముడు కృష్ణుడు ఫైర్



రామకృష్ణుడు, కృష్ణుడు

సాక్షిప్రతినిధి, కాకినాడ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తోన్న వేళ తెలుగుదేశం పార్టీకి తునిలో బిగ్ షాక్. టీడీపీలో చంద్రబాబు తరువాత నంబర్ టుగా పిలిచే మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడికి కోలుకోలేని ఎదురుదెబ్బ తగిలింది. పోలింగ్‌కు సమయం దగ్గర పడుతున్న తరుణంలో తమ్ముడు కృష్ణుడు రామకృష్ణుడికి చుక్కలు చూపిస్తున్నారు. ఇంతకాలం తాను చెప్పినట్టే నడుచుకున్న తమ్ముడు కృష్ణుడు ఎదురుతిరిగారు అనే కంటే ఆ పరిస్థితికి అన్న రామకృష్ణుడే కారణమయ్యాడంటున్నారు. తెలుగుదేశం పార్టీలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తిరుగులేని నేతగా చంద్రబాబు వద్ద పేరున్న రామకృష్ణుడు సొంత ఇంటిని చక్కదిద్దుకోలేక పార్టీ పరువు రోడ్డున పడే పరిస్థితికి కారణమయ్యారని పార్టీ నేతలు గుసగుసలాడుకుంటున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పార్టీలో ఆది నుంచి తన ప్రాబల్యం కోసం గ్రూపులు కట్టి మూడు ముక్కలాట ఆడటం రామకృష్ణుడికి కొత్తేమీ కాదంటున్నారు. జిల్లాల విభజనకు పూర్వం మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, నిమ్మకాయల చినరాజప్ప, దివంగత నేతలు డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు, బొడ్డు భాస్కరరామారావు వంటి నేతలతో గ్రూపులు కట్టి విభజించి పాలించి పబ్బం గడుపుకున్న రామకృష్ణుడికి ఇంతకాలానికి సరైన శాస్తి జరిగిందని టీడీపీ నేతలే అంటున్నారు. పార్టీలో అపర చాణక్యుడిగా పేరున్న రామకృష్ణుడికి ఇంతకాలానికి తమ్ముడు రూపంలో ప్రతిఘటన ఎదురవుతుందని ఎవరూ ఊహించలేదంటున్నారు. సొంత సోదరుడినే సముదాయించలేని రామకృష్ణుడు ప్రాబల్యం పార్టీలో తగ్గిపోవడం ఖాయమంటున్నారు. గతంలో మాదిరిగా భవిష్యత్‌లో కూడా చక్రం తిప్పుతామంటే పార్టీలో చెల్లుబాటు కాదని తెలుగు తమ్ముళ్లు పేర్కొంటున్నారు.

వరుస అవమానాలు సహించలేకే..

తుని టీడీపీ అసెంబ్లీ అభ్యర్థిత్వం కుమార్తె దివ్యకు కట్టబెట్టడం కోసం రామకృష్ణుడు తమ్ముడు కృష్ణుడిని బలిపశువును చేశాడంటున్నారు. తునిలో వరుస ఓటములకు తమ్ముడు కృష్ణుడే కారణమంటూ ఎన్నికలకు ఆరు నెలలు ముందు నుంచే రామకృష్ణుడు తన వర్గీయుల ద్వారా పార్టీలో పథకం ప్రకారం ప్రచారం చేయించారు. చంద్రబాబు వద్ద మైనస్ మార్కులు వేయించి చివరకు తమ్ముడికి సీటు దక్కకుండా చేయగలిగారు. అంతటితో ఆగితే అసలు సమస్యే లేకపోయేదంటున్నారు. అసలు కృష్ణుడిని పార్టీలోనే లేకుండా చేయాలనే ఎత్తుగడతో దివ్యతో ప్రచారానికి దూరంగా ఉండాలని స్వయంగా రామకృష్ణుడే షరతు పెట్టారు. అప్పటి నుంచి పార్టీ కార్యకలాపాలకు దూరమైన కృష్ణుడు పార్టీలో ఉండటమా? విడిచిపోవడమా? అనే విషయంలో అంతర్మథనం చెందుతూ వస్తున్నారు. అప్పటి నుంచి అన్న రామకృష్ణుడు నుంచి ఎదురవుతోన్న వరుస అవమానాలు భరించ లేని పరిస్థితుల్లో కృష్ణుడి అనుచరులు ఒక్కొక్కరూ పార్టీకి రాజీనామాలు చేస్తూ వస్తున్నారు. అయినా ఎక్కడా అన్నలో పశ్చాత్తాపం లేకపోవడంతో రగిలిపోతోన్న కృష్ణుడు గడచిన నెల రోజులుగా సమయం కోసం కాచుక్కూర్చున్నారు. అన్నయ్య కళ్లల్లో ఆనందం కోసం నాలుగు దశాబ్దాల పాటు కలిసిమెలిసి ఉన్నా ఏనాడూ జిల్లా పరిషత్, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్, జిల్లా గ్రంథాలయ సంస్థ వంటి పదవులు ఆశించలేదని రాజీనామా సందర్భంగా ఇంతకాలం తన మనసులో ఉన్న ఆవేదనను మీడియా ఎదుట తమ్ముడు వ్యక్త పరిచారు. ఇన్నేళ్లు సేవ చేసినా చివరకు నమ్మక ద్రోహానికి వెనుకాడలేదని, తట్టుకోలేకనే పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, పదవులకు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. పార్టీకి దూరం పెట్టిన దగ్గర నుంచి ఇదంతా ఊహిస్తున్నదేనని, రామకృష్ణుడికి సరైన సమయంలో సరైన గుణపాఠమే చెప్పారని తెలుగు తమ్ముళ్లు అభిప్రాయపడుతున్నారు. తెలుగుదేశంపార్టీలో నాలుగు దశాబ్దాల పాటు కలిసిమెలిసి ఉన్న యనమల సోదర ద్వయం తెగతెంపులు టీడీపీలో చర్చనీయాంశంగా మారింది.

కృష్ణుడితోపాటు అతని వెంట నియోజకవర్గంలో ముఖ్యమైన నాయకులు కూడా రాజీనామాలకు సిద్ధమయ్యారు. నాయకుల మూకుమ్మడి రాజీనామాల నిర్ణయంతో తునిలో తెలుగుదేశం పార్టీ నిట్టనిలువునా చీలిపోవడం ఖాయమైపోయింది. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం తరువాత తునిలో టీడీపీ కోట కుప్పకూలిపోయింది. తుని పట్టణంతో పాటు రూరల్ మండలాల్లో స్థానిక సంస్థలలోను టీడీపీ అడ్రస్ గల్లంతైంది. అప్పటి నుంచి పార్టీ ఉనికి కోసం జరుగుతోన్న ప్రయత్నాలపై కృష్ణుడు అండ్ కో రాజీనామాలతో నీళ్లు చల్లారని చెప్పొచ్చు. తాజా పరిణామాలతో సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఎదురీదడం తప్పదు.

ఓటు.. ఐదు రకాలు



కాకినాడ సిటీ: ప్రజాస్వామ్యంలో అర్హులైన ప్రతి పౌరుడికి రాజ్యాంగం ఓటుహక్కు కల్పించింది. ఓటు ద్వారానే ప్రజాప్రతినిధులను ఎన్నుకుంటారు. ఐదు రకాలుగా ఓట్లు ఉన్నాయి. ఒక్కో దానికి ఒక్కో ప్రత్యేకత ఉంది. టెండర్ ఓటు, సాధారణ ఓటు, సర్వీస్ ఓటు, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు, ప్రవాస భారతీయులకూ ఓట్లు ఉన్నాయి.

టెండర్ ఓటు

ఓటరు జాబితాలో ఓటుహక్కు ఉన్న ఓటరు పోలింగ్ బూత్‌లోకి వెళ్లి ఓటు వేసేటప్పటికే ఆ వ్యక్తి ఓటును మరొకరు వేసినా, సదరు వ్యక్తి ఓటు వేయొచ్చు. ఇందుకోసం రిటర్నింగ్ అధికారి వద్ద తాను ఓటు హక్కును వినియోగించుకోలేదని నిరూపించాలి. పోలింగ్ అధికారి హామీతో ఓటును వినియోగించుకోవచ్చు. దీన్నే టెండర్ ఓటు అంటారు.

సాధారణ ఓటు

18 సంవత్సరాలు నిండిన ప్రతీ పౌరుడు అన్ని రకాల ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం కలిగి ఉంటాడు. ఇదే సాధారణ ఓటు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును పొందేందుకు అర్హులు. ఫారం 6 ద్వారా దరఖాస్తు చేసుకుని ఆధారాలు చూపిస్తే ఓటు హక్కు కల్పిస్తారు.

సర్వీస్ ఓటు

సైనికుల కోసం కేంద్ర ఎన్నికల సంఘం సర్వీస్ ఓటు వేసే అవకాశం కల్పించింది. ఎన్నికల సమయంలో సైన్యంలో విధులు నిర్వహించే సైనిక ఉద్యోగులు ఇక్కడికి రాలేని పరిస్థితిలో ఉంటారు. సైన్యంలోని ప్రధాన అధికారి ద్వారా, తపాలశాఖ ద్వారా ఓటును పంపించవచ్చు. ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌ఫరబుల్ ద్వారా కూడా పంపవచ్చు.

పోస్టల్ బ్యాలెట్ ఓటు

ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు కూడా ఓటర్లే. ఎన్నికల సమయంలో వీరు ఎన్నికల విధులు నిర్వహిస్తారు. వారికి కూడా ప్రజాప్రతినిధులను ఎన్నుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కేంద్ర ఎన్నికల సంఘం కల్పించింది. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగులు ముందుగా పోస్టల్ బ్యాలెట్‌ను తపాలాశాఖ ద్వారా పంపించి ఓటు హక్కును వినియోగించుకుంటారు. మరి కొంతమంది పోలింగ్ ముందురోజే ప్రత్యేకంగా ఉద్యోగుల కోసం పోస్టల్ పోలింగ్‌ను ఏర్పాటు చేసి ఓటు వేయిస్తారు. ఓట్ల లెక్కింపునకు ముందు పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. ఒక్కో సందర్భంలో పోస్టల్ ఓట్లే కీలకంగా మారతాయి.

ప్రవాస భారతీయులకూ..

ప్రవాస భారతీయులకూ ఓటు హక్కు పొందేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఆన్‌లైన్‌లో ఫారం 6ఏ ద్వారా దరఖాస్తులు చేసుకుని తగిన ఆధారాలు చూపించి ఓటు హక్కును పొందిన ప్రవాస భారతీయులు ఆసక్తి మేరకు విదేశాల నుంచి వచ్చి తమ ప్రాంత ప్రజాప్రతినిధిని ఎన్నుకునేందుకు ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉంది.